మండల పరిషత్ ఆవరణలోకి రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలన్నీ మున్సిపాలిటీలుగా మారడంతో ఖాళీగా ఉన్న మండల పరిషత్, జిల్లా పరిషత్ భవనాల్లోకి రిజిస్ట్రేషన్ కార్యాలయాలను మార్చాలని ఆదేశిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జెడ్పీ కార్యాలయంలోకి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల పరిషత్ భవనంలోకి మార్చాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం తాజా జిల్లా యూనిట్‌గా అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఒకే సముదాయంలో ఏర్పాటు చేయాలని యోచిస్తుండటంతో కార్యాలయాల తరలింపు సాధ్యాసాధ్యాలపై ఉన్నత అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

మాధవరెడ్డికి నివాళి



మాధవరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

మేడ్చల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర సమర యోధుడు సింగిరెడ్డి మాధవరెడ్డి వర్ధంతిని శుక్రవారం గౌడవెల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆయన కుమారుడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాధవరెడ్డి చౌరస్తాలోని మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా లోని అన్ని నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ నియోజకవర్గాల, మండలాల ,మున్సిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం రైతుల భిక్షాటన



ఘట్‌కేసర్‌లో భిక్షాటన చేస్తున్న రైతులు

ఘట్‌కేసర్: పంట రుణమాఫీ చేయాలని కోరుతూ శుక్రవారం రైతు రుణమాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పదో రోజుకు చేరుకున్నాయి. అందరికీ అన్నం పెట్టే రైతుల రుణమాఫీ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోనందుకు నిరసనగా పట్టణంలో భిక్షాటన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు సుదర్శన్‌రెడ్డి శ్రీనివాస్‌గౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ బిక్షపతిగౌడ్, మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కొండల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయిరెడ్డి, సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఐలయ్య యాదవ్, బి శ్రీనివాస్‌గౌడ్ సంజీవ రెడ్డి, పాల్గొన్నారు.

ఇల్లు కూలిపోతుందేమోనని..

గుండెపోటుతో మహిళ మృతి



రాధాబాయి (ఫైల్)

జవహర్‌నగర్: భారీ వర్షం కారణంగా ఇంట్లో వరద నీరు చేరడంతో భయాందోళనకు గురై ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో వరద నీరు పోటెత్తింది. పాపయ్యకాలనీలో నివసించే కురాకుల రాధాబాయి (56) ఇల్లు జలమయమైంది. దీంతో ఆమె ఇళ్లు కూలిపోతుందేమోనని భయాందోళనకు గురైన ఆమెకు గుండెపోటు రావడంతో స్థానికులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

హాస్టల్ గదిలో విద్యార్థిని ఆత్మహత్య

ఘట్‌కేసర్: కళాశాల హాస్టల్ గదిలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నేరెడుచెర్లకు బాలిక (17 ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమా రెండో సంవత్సరం చదువుతూ అదే కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్న భోజనం హాస్టల్ గదిలోకి వెళ్లిన ఆమె తిరిగి క్లాసుకు రాలేదు. తోటి విద్యార్థినులు హాస్టల్ గదికి వెళ్లి తలుపు తట్టగా లోపలి నుంచి గడియ వేసి ఉంది. అనుమానంతో కిటికిలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. దీంతో కళాశాల సిబ్బం తలుపులు పగులగొట్టి ఆమెను ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూ భారతిపై పెరిగిన ఆశలు

పరిష్కారమైన దరఖాస్తులు 26,703

- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 4,773
- జిల్లాలో భూభారతిలో వచ్చిన దరఖాస్తులు 72,163
- తిరస్కరణకు గురైన దరఖాస్తుల సంఖ్య 30,607.
- ధరణి స్థానంలో 'భూ భారతి' చట్టం
- భూ సమస్యలు గట్టెక్కుతుండటంతో రైతుల్లో ఆనందం



సాక్షి,మేడ్చల్ జిల్లా: భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, భూ వివాదాల పరిష్కారానికి కాంగ్రెస్ సర్కారు 'ఆర్వోఆర్ చట్టం-2020 ధరణి' స్థానంలో నూతన రెవెన్యూ చట్టం 'భూ భారతి-2025'అమల్లోకి వచ్చిన తర్వాత భూ సమస్యల పరిష్కారం ఓ కొలిక్కి వస్తోంది. దీంతో గత ఐదారేళ్లుగా నిషేధిత భూముల జాబితా, పార్టు-బి భూములు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పేర్ల మార్పు, భూ హక్కులు, సాదాబైనామాల క్రమబద్ధీకరణ తదితర అపరిష్కృత సమస్యలు పరిష్కారమవుతాయని రైతుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది. భూ సమస్యల పరిష్కారం తహసీల్దార్ స్థాయిలో కాకపోతే.. ఆర్డీవో.. అక్కడి నుంచి కలెక్టర్‌కు అప్పీలు చేసుకునే అవకాశాన్ని నూతన చట్టంలో కల్పించడం.. అందుకు ట్రిబ్యునళ్ల ఏర్పాటు చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- మ్యుటేషన్లు, వారసత్వ బదిలీ, నాలా కన్వర్షన్స్, సక్సెషన్, పీవోబీ, పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణలు, కొత్త పాసు పుస్తకాల జారీ తదితరాలకు సంబంధించి జిల్లాలో 4,491 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. వీటిలో కీసర రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,084 దరఖాస్తులు ఉండగా, మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,407 దరఖాస్తులు ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో 35 రకాల ఆప్షన్స్(ఐచ్చికా)లను పొందుపరిచినా.. సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవటంతో.. వీటన్నింటికి భూభారతి కొత్త చట్టంలో పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూ భారతిలో భాగంగా మొత్తం 72,163 దరఖాస్తులు అందగా,ఇందులో 30,607 దర ఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 31,194 దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించిన అధికార యంత్రాంగం వాటిని పరిశీలించటంతోపాటు పలు ధఫాలుగా విచారణ నిర్వహించి, ఇప్పటి వరకు 26,703 దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న 4,491 దరఖాస్తులను పరిశీలించటంతోపాటు పలు దశల్లో విచారించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

మేడ్చల్‌పై ప్రత్యేక దృష్టి..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉండటంతో ....భూభారతి అమలుపై రెవె న్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ భూములను చాలా మంది నకిలీ పత్రాలతో పట్టాలు చేసుకోవడం, పార్టు-బీ భూ ములు సైతం ' ఎక్కువగా ఉండటం తదితర కారణాల నేపథ్యంలో మేడ్చల్ జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నట్లు తెలుస్తోంది.

రైతుల ఆశలు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని భూసమస్యలపై ఎంపీగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనేక ఫిర్యాదులు, దరఖాస్తులు అందాయి. దీనికి తోడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూసమస్యలు కూడా అధికంగానే ఉన్నాయి. పట్టాదారు పాసుపుస్తకాలు లేక కొందరు, రికార్డుల్లో తారుమారు కావటంతో మరిందరు ఇబ్బందులు పడుతున్నారు. భూభారతితో ఇలాంటి సమస్యలు తొలగిపోతున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

పాత లేఅవుట్లకు పాసుపుస్తకాలు

- ప్లాట్లను కాజేస్తున్నారని అల్వాల్ గ్రీన్ ఫీల్డ్ కాలనీవాసుల ఆందోళన
- న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి

సాక్షి,మేడ్చల్ జిల్లా: పాత లే అవుట్లకు అక్రమ పద్ధతిలో పాసు పుస్తకాలను తెచ్చుకుని తమ ప్లాట్లను కబ్జా చేస్తున్నారని, వారి నుంచి రక్ష ణ కల్పించాలని అల్వాల్, ఖానాజీ గూడకు చెందిన గ్రీన్ ఫీల్డ్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నారు .ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. . 1987లో అల్వాల్, ఖానాజీగూడ గ్రీన్ ఫీల్డ్ కాలనీలోని సర్వే నంబర్లు 373, 375, 376,378, 379, 385, 386లో గ్రామ పంచాయతీ లే అవుట్ వేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. 1989 నుంచి 1992 వరకు ఈ లేఅవుట్ లో 800 మంది ప్లాట్లను కొనుగోలు చేసి, పొజిషన్ కూడా తీసుకుని సర్వే నంబర్ 385లో ఇళ్లను నిర్మించుకొని 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే దానిని ప్రభుత్వ భూమిగా ప్రకటిస్తూ కోర్టు, జిల్లా కలెక్టర్ వెల్లడించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. దీంతో జీవో నంబర్ 166 కింద తమ ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.. 2023లో సర్వే నంబర్ 385/ఎ/2 లో ఎస్. సంజీవ రెడ్డికి 1.28 ఎకరాలు, సర్వే నంబర్ 385/ఎ/1/2లో ఎస్.మోహన్ రెడ్డి అనే వ్యక్తికి 1.06 ఎకరాలు ఉన్నట్లు అక్రమంగా పాసు బుక్‌లను తెచ్చుకున్నారని వారు ఆరోపించారు. లేఅవుట్ లో పాసు బుక్కులు ఇవ్వడంపై తాము హైకోర్టును ఆశ్రయించడంతో 2025, ఫిబ్రవరి 10న పాస్ బుక్కులను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మోహన్ రెడ్డి, సంజీవరెడ్డి తమ ప్లాట్లను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారని తెలిపారు. సర్వే నంబర్ 385లో వారు వెంచర్ చేసుకుని విక్రయించుకున్నారని, తిరిగి తమ ప్లాట్స్ కూడా వారివే అని ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

అత్యవసర కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



విజయపురి కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి



దాయర కుంట వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న కమిషనర్..

కీసర: భారీ వర్షాల కారణంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో వరదముంపు కాలనీ వాసుల కోసం అత్యవసర కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వరదముంపు కాలనీలతోపాటు, అన్నరాయిని చెరువు నాలా, చర్లపల్లివాగుతో పాటు, రాంపల్లి చౌరస్తాలో వరద ప్రభావాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో భారీ వర్షాల కారణంగా ఇళ్లు దెబ్బతిన్న వారు, వరద ముంపునకు గురైన నివాసాలకు చెందిన కుటుంబసభ్యులు మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యవసర నివాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు మంచినీరు, ఆహారం, ఇతర ప్రాథమిక అవసరాలను అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాంపల్లి-చర్లపల్లి రహదారిలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రహదారిని తాత్కాలికంగా మూసివేశామని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని సూచించారు. అరవింద్‌నగర్ కాలనీలో వరద నీరు రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తుండటంతో ఓ వ్యక్తి అనారోగ్యానికి గురయ్యారని, వెంటనే అతడిని తమ సిబ్బంది చికిత్స నిమిత్తం ఆటోరిక్షాలో ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం అందించామన్నారు. విజయపూరి కాలనీలో నాలా ఒడ్డున ఉన్న ఇంటి ప్రహరీ, పునాదులు వరదనీటి తీవ్రతకు పూర్తిగా దెబ్బతిన్నాయి . ఇళ్లు కూలిపోయే పరిస్థితి ఏర్పడటంతో ఆ కుటుంబాన్ని వారి సామాగ్రితో పాటు సురక్షిత ప్రాంతానికి తరలించామన్నారు. మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులున్న తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ ఈటల పర్యటన

శామీర్‌పేట్: తూముకుంట మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు పొంగి కాలనీలు జలమయమయ్యాయి. దీనిపై సమాచారం అందడంతో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తూముకుంట మున్సిపాలిటీలోని ముంపు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిచారు. మున్సిపాలిటీలోని అనురాగ అపార్ట్‌మెంట్స్, ముందాయిపల్లి రోడ్డు, వెంకటేశ్వర కాలనీ, పోతాయిపల్లి చెరువు మత్తడిని పరిశీలించారు. ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో వరద, మరమతులపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.



నాలాను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సురేష్, మున్సిపల్ అధికారులు కన్నయ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని వినతి



ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకుల్ స్థలంలో కేజీ- పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, గురుకుల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, అందులో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని లేఖలో కోరా రు. ఈ నెల 27న నిర్వహించనున్న బతుకమ్మ సంబురాల్లో పాల్గొనాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, జంగయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్ మల్లేశ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, భోజిరెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

8వ వేతన కమిషన్ ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న రైల్వే ఉద్యోగులు

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వ వేతన కమిషన్ ఏర్పాటు చేసి 2026 జనవరి 1 నుంచి అమలు చేయాలని ఆలిండియా మెన్ ఫెడరేషన్, రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘట్‌కేసర్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సీనియర్ సెక్షన్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే సేఫ్టీ క్యాటగిరీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, ఇంజినీరింగ్ విభాగంలో నైట్ పెట్రోలింగ్‌కు ఇద్దరిని నియమించాలని, అన్ని సేఫ్టీ కేటాగిరీలకు రిస్క్ అలవెన్స్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ డైరెక్టర్ సెక్రటరీ విజయకుమార్, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, యూత్ కన్వీనర్ అనుమేశ్‌కుమార్, రవి, జక్కిబాబు, హెచ్ శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, కుమార్, జ్ఞానేశ్వరి, అనుసూయ, సురేందర్, సోమవ్వ, ప్రభాకర్, మాధవి, లావణ్య, యాదగిరి, వెంకటేశం, మధు, పాండు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్: ఐటీఐల్లో ప్రవేశపెట్టిన కొత్త కోర్సులలో మేడ్చల్ ఐటీఐలో 40సీట్లు ఖాళీగా ఉన్నాయని మేడ్చల్ ఐటీఐ ప్రిన్సిపాల్ హనుమా నాయక్ తెలిపారు. సీయింగ్ టెక్నాలజీ, ఫ్రూట్, వెజిటబుల్ ప్రాసెసింగ్‌లలో 40సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హత,ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత చెంది 14 సంవత్సరాలు నిండిన యువత కోర్సులకు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు మేడ్చల్ ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

సెయింట్ పీటర్స్‌లో స్పెకథాన్ ప్రారంభం

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్పెకథాన్ 2025 పేరిట జాతీయ స్థాయిలో 36 గంటల పాటు నిర్వహించనున్న హ్యాకథాన్ శుక్రవారం ప్రారంభమైంది. ఎస్ఎస్ఐసీ డిప్యూటీ మేనేజర్ రాజీవ్‌నాథ్, సుప్రజ టెక్నాలజీస్ సీఈఓ సంతోష్ చాలువాడి, కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి హ్యాకథాన్ లు పరిశ్రమలో అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెంపొందించేందుకు



హ్యాకథాన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 60 బృందాలు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సరోజా రెడ్డి, అనురాగ్‌రెడ్డి, హెచ్‌ఓడీ శాంతి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛత హీ సేవా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని చర్మాస్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీలో సెయింట్ ఆంటోనీస్ పాఠశాల విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని నినాదాలు చేస్తూ, ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటగోపాల్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్,డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, అధికారులు,సిబ్బంది, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ అధికారులు, విద్యార్థులు

చీర్యాల జెడ్‌పీహెచ్‌లో విద్యార్థులకు పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కీసర: బీజేపీ సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చీర్యాల జెడ్పీహెచ్ స్కూల్‌లో బీజేపీ కీసర మండల అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సింధూర్‌పై డ్రాయింగ్ పోటీలు, హైదరాబాద్ విమోచన అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెరెడ్డి ఆపరేషన్ సింధూర్, హైదరాబాద్ విమోచన అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బోడ శ్రీనివాస్ రావు, దొబ్బల శ్రీశైలం, మండల ప్రధాన కార్యదర్శులు నల్ల వెంకట్‌రెడ్డి, నాగరాజు, సత్యనారాయణ, మల్లేష్, ముత్యం, జంగయ్య, రామకృష్ణ, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, బత్తుల కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యం 25 వేల మెట్రిక్ టన్నులు

- 13 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సివిల్ సప్లైశాఖ సన్నాహాలు
- రైతులకు వసతుల కల్పన..
- అందుబాటులో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు
- నేడు ధాన్యం సేకరణపై సంబంధిత శాఖలతో అదనపు కలెక్టర్ సమావేశం

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఖరీఫ్ సీజన్‌లో రైతు పండించిన వరి ధాన్యామంతా కొనుగోలు చేసేందుకు జిల్లా అధికారయంత్రాంగం సన్నద్ధమవుతోంది. ధాన్యం సేకరణకు 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వరి పంట సాగుకు అనుగుణంగా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాగలదని వ్యవసాయ శాఖ అంచనా. జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశాలతో జిల్లా పౌరసరఫరాల శాఖ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతులను కల్పించడంతోపాటు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు శనివారం సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం సేకరణ ,వసతుల కల్పన తదితర అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించనున్నారు.

పెరిగిన వరి సాగు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఖరీఫ్ సీజన్(వానాకాలం)లో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 15,066 ఎకరాలు కాగా, రైతులు మాత్రం 17,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. దీంతో వరి పంట దిగుబడి సుమారుగా 40 వేల మెట్రిక్ టన్నులు రాగలదని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించటంతోపాటు ధాన్యాన్ని కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. సన్న రకం ధాన్యానికి మద్ధతు ధరతోపాటు అదనంగా బోనస్ రూ.500 ఇవ్వనున్నారు.వరి పంటకు కేంద్రం ప్రకటించిన మద్ధతు ధర ప్రకారం గ్రేడ్ 'ఎ' వరి ధాన్యం క్వింటాల్ ధర 2,389, సాధారణ వరి ధాన్యం క్వింటాల్ ,ధాన్యం ధర రూ.2,369 నిర్ణయించి క్రయ విక్రయాలు జరిగేలా జిల్లా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు,తేమ యంత్రాలు ,గన్నీ బ్యాగులతో సహా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో గోదాముల్లోకి తరలించేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 13 ధాన్యం సేకరణ కేంద్రాల్లో 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనా వేయటంతోపాటు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటోంది.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

మేడ్చల్ జిల్లాలో 13 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఏదులాబాద్, మాదారం(ఘట్కేసర్ మండలం), కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి(మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్ ,డబుల్‌పూర, పూడూరు(మేడ్చల్ మండలం),శామీర్‌పేట్, అలియాబాద్, జగ్గంగూడ, కీసర మండల కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ధాన్యమంతా కొంటాం



రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 13 సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ధాన్యం సేకరిస్తాం. మధ్య దళారులను ఆశ్రయించకుండా నేరుగా ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తీసుకెళ్లాలి. కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యంతో పాటు తమ వెంట ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుసక్తం, బ్యాంకు ఖాతా జిరాక్స్ తెచ్చుకోవాలి.

– సుగుణబాయి, మేనేజర్, పౌరసరఫరాల శాఖ, మేడ్చల్ జిల్లా.